క్లుప్తంగా

గణేశునికి చతుర్థి విశిష్టమైనది


ప్రత్యేక అలంకరణలో భోగి గణపతి

బోట్‌క్లబ్: విభువన సంకష్టహర చతుర్థి సందర్భంగా స్థానిక సూర్యారావుపేటలోని దూసర్లపూడివీధిలో ఉన్న స్వయంభూ భోగి గణపతి పీఠంలో శుక్రవారం ప్రత్యేక పూజలతో పచ్చ కర్పూర హారతి నిర్వహించారు. స్వామి వారికి ఉండ్రాళ్లతో తయారు చేసిన దండను గణపతి మెడలో అలంకరించి సామూహిక సహస్ర నామపారాయణ చేశారు. మహిళలకు శోభకృత్ నామ సంవత్సర వరలక్ష్మీ వ్రతం పుస్తక ప్రతులను పంపిణీ చేశారు. పీఠం వ్యవస్థాపకులు రమణరాజు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరిని దర్శించిన కస్టమ్స్ కమిషనర్


బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్న కస్టమ్స్ కమిషనర్ సాదు నరసింహారెడ్డి

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామిని శుక్రవారం కస్టమ్స్ కమిషనర్ సాదు నరసింహారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి స్వామివారికి అభిషేకాలు చేయించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం కుంకుమ పూజలు చేశారు. ఈఓ ఆయనకు అమ్మవారి ప్రసాదం, అమ్మవారి ఫొటో అందించారు.

సకాలంలో డ్రైన్ నిర్మించండి


సీసీ డ్రెయిన్ నిర్మాణ పనిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కరప: గ్రామ శివారు రామకంచిరాజునగర్ కాలనీలో చేపట్టిన సీసీ డ్రెయిన్ నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయాలని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు అన్నారు. కాలనీలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న పనిని శుక్రవారం ఆయన పరిశీలించి సూచనలిచ్చారు. గడప గడపకూ నిధులతో ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, మేడిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కరుణశ్రీకి ఘన నివాళి


బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కరుణశ్రీకి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: మనుషుల్లో ఉత్తమ మార్పు, నైతిక విలువలు, సమాజ శాంతికై తన కవిత్వాన్ని వినియోగించిన అభ్యుదయ కవి జంధ్యాల పాపాయ్య శాస్త్రి (కరుణశ్రీ) జయంతి సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఘన నివాళులర్పించింది. కరుణశ్రీ చిత్రపటానికి విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, చంద్రరావు, సత్యనారాయణ తదితరులు శుక్రవారం నివాళులర్పించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

కాకినాడ సిటీ: నాయీ బ్రాహ్మణులను కించపరిచిన జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నవసమాజ్, ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది. కాకినాడలో శుక్రవారం సాయంత్రం సమాఖ్య నాయకులు సుందరపల్లి వీవీఎస్ గోపాలకృష్ణ, కొమ్మన తాతారావు విలేకర్లతో మాట్లాడారు. గత ఏడాది నాయీ బ్రాహ్మణులను కించపరచకుండా చులకనగా మాట్లాడకుండా ప్రభుత్వం జీవో నంబర్ 50ని విడుదల చేసిందన్నారు. జేసీ ప్రభాకరరెడ్డి అహంకారంతో నాయీబ్రాహ్మణ మనోభావాలను దెబ్బతీసారని ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు చేయూత

బాలాజీచెరువు: ప్రత్తిపాడు రెడ్నం రామ్మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హరీష్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ రూ.20 వేల విలువైన క్రీడా సామగ్రిని శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం వెంకటరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి టౌన్ షిప్

- కొమరగిరి లేఅవుట్‌లో వేగంగా గృహనిర్మాణాలు
- ముందుకొస్తున్న లబ్ధిదారులు
- ఉపాధికి ఊతమిచ్చేలా వనరులు


కొమరగిరిలో నిర్మాణం పూర్తి చేసుకున్న నివాసం


కొమరగిరిలో ఊపందుకున్న గృహనిర్మాణాలు

కాకినాడ: సొంతింటికల నెరవేర్చడంతో పాటు ఉపాధి చూపించే దిశగా సాగుతున్న కొమరగిరి లేఅవుట్ పేదల జీవితాల్లో మార్పు తీసుకు రాబోతోంది. కాకినాడ వాసులకు కేటాయించిన కొమరగిరి లేఅవుట్‌లో అక్కడ నివాసం ఉండే పేదలకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న కృషితో ఇప్పుడు నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద లేఅవుట్‌గా ఉన్న కొమరగిరి నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో అధికార యంత్రాంగం ఈ లేఅవుట్‌పై దృష్టి ప్రతిష్టాత్మకంగా తీసుకొంది.

కుటీర పరిశ్రమల ఏర్పాటు దిశగా..

లేఅవుట్ ఆవరణలో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు చెన్నై సిల్క్స్ వంటి సంస్థలు ఇప్పటికే ముందుకు వచ్చాయి. వీటితో పాటు బొమ్మల తయారీ పరిశ్రమలు, రేవు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం ద్వారా ఇక్కడ ఉపాధి అవకాశాలు పెంచే దిశగా ప్రత్యేక దృష్టిసారించారు. దాదాపు 350 ఎకరాల విస్తీర్ణంలో 16,600 మంది లబ్ధిదారులకు ఇక్కడ ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే 9,565 ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. వీటిలో 6,974 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే మౌలిక వసతుల కల్పన వేగవంతం చేశారు. వీటికి సుమారు రూ. 357.35 కోట్లు వెచ్చిస్తున్నారు. మొత్తం ఇళ్లు పూర్తయితే సుమారు 50వేల మంది ప్రజలతో కొమరగిరి లే అవుట్ మరో మినీ టౌన్‌షిప్‌గా అవతరించనుంది. దీంతో సహజంగానే అక్కడ విద్య, వైద్య సదుపాయాలు, ప్రత్యేక పరిపాలన కేంద్రాలు ఏర్పాటు కానుండడంతో ప్రజల దృష్టి ఈ లే అవుట్‌పై పడింది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేకరరెడ్డి, నగరపాలక సంస్థ అధికారులు ఈ లేఅవుట్‌పై ప్రత్యేక దృష్టిసారించారు.

మరో టౌన్‌షిప్‌గా కొమరగిరి



కొమరగిరి లే అవుట్‌లో ఇళ్లు కట్టుకునేందుకు సుమారు పది వేల మంది తమ ఆమోదాన్ని తెలిపారు. ప్రభుత్వం కూడా ఈ లేఅవుట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. అనేక కుటీర పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. ఈ ప్రాంతం మరో మున్సిపాలిటీగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా ఈ లే అవుట్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే

సొంతింటి కల నెరవేరింది



నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ప్రభుత్వమే స్థలం ఇచ్చి రూ.1.8 లక్షలు సబ్సిడీ సొమ్ము కూడా అందజేయడంతో మరికొంత సొంత నిధులు వెచ్చించి ఇళ్లు కట్టుకున్నాం. సొంతిళ్లు కట్టుకోవడం ఆనందంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– రాజేశ్వరి, లబ్ధిదారురాలు, కాకినాడ

కలెక్టర్‌ను కలసిన ఈఈ రాధాకృష్ణయ్య



కాకినాడ సిటీ: తిరుపతి జిల్లా నుంచి కాకినాడ జిల్లాకు పదోన్నతిపై వచ్చి ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ బి.రాధాకృష్ణయ్య శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియను మర్యాదపూర్వకంగా కలిశారు.

రెండో రోజూ సీపీఐ సదస్సు

కాకినాడ సిటీ: సీపీఐ జిల్లా శాఖ కార్యదర్శుల వర్క్‌షాప్ శుక్రవారం కాకినాడ గాంధీభవన్‌లో నిర్వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శులు కామిరెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ భవిష్యత్ కార్యాచరణకు దోహదపడుతుందన్నారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న మోడీకి స్వస్తిపలకాలని అన్నారు. క్షేత్రపాల్, సత్యనారాయణమూర్తి, కాకినాడ అర్బన్, రూరల్, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని, ప్రజాసంఘాల బాధ్యులు తదితర ప్రాంతాల నుంచి పాల్గొన్నారు.

120 మందికి బీఎండీ పరీక్షలు

కాకినాడ క్రైం: కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఎముకల పటుత్వ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆర్.విఠల్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరిగాయి. 50 సంవత్సరాలు పైబడ్డ 120 మందికి ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి పరీక్షలను ప్రారంభించారు. యుజైన్ ఫార్మాస్యూటికల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో డాక్టర్ పార్థసారథి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- గొర్రిపూడిలో గడప గడపకూ..

కరప: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలం గొర్రిపూడి–2 గ్రామ సచివాలయ పరిధిలోని ఇందిరాకాలనీలో శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి పేదగుండె తట్టి అండగా ఉండాలన్న తపనతో పాలన చేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకాల సుబ్బారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజు, ఊబా కిశోర్ తదితర పార్టీ నాయకులు, గ్రామ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల నాయకులు వెంటరాగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారిని పలకరిస్తూ ముందుకు సాగిపోయారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందజేసి, ఆదుకోవాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హత ఉండీ ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వలంటీర్‌కి తెలిపి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి జల్ జీవన్ మిషన్‌లో ఇక్కడ రెండో ట్యాంక్ నిర్మాణం జరుగుతోందన్నారు. ఇంటింటికీ కుళాయి పనులు పూర్తయ్యేలోగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కాలనీలో తాగునీరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఎ.వర్ధన్‌ను ఆదేశించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు.

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్లను ఎమ్మెల్యే కన్నబాబు అందజేశారు. కడుపులో బిడ్డ కదలిక దగ్గర నుంచి చివరి మజిలీ వరకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, రెడ్డిపల్లి రమేష్, సవిలే రాజేష్, నక్కా సత్తిబాబు, పి.ప్రేమసాగర్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.శ్రీనివాస్, వీఆర్వో డి.భరణికుమార్ పాల్గొన్నారు.


గొర్రిపూడిలో టేక్‌హోమ్ రేషన్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

తూరంగిలో..

కాకినాడ సిటీ: తూరంగి నాయీ బ్రాహ్మణకాలనీ, ఏఎస్ఆర్ కాలనీల్లోని 238, 237 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు, టీహెచ్‌ఆర్ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. అలాగే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, క్రాంతికుమారి, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, సూపర్‌వైజర్ సూర్యావతి, కింతాడ సత్యనారాయణ, తెలగ్రాపు ఈశ్వరరావు తదితరులు పాల్గొని పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.


ర్యాలీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

తల్లిపాలే సంజీవని

కాకినాడ క్రైం: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం డాక్టర్ హేమలతా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో తల్లిపాల ప్రాధాన్యతను సూపరింటెండెంట్ వివరించారు. శిశువు భవిత, ఆరోగ్యానికి తల్లిపాలు సంజీవని వంటివన్నారు. తల్లిపాల ప్రాధాన్యం తెలియక ఎందరో తల్లులు తమ బిడ్డలకు వాటి ప్రయోజనాలు అందించలేకపోతున్నారన్నారు. మోతాదుకు మించి తల్లి పాలు స్రవించే మహిళలు ఎవరైనా జీజీహెచ్‌లోని మదర్ మిల్క్‌బ్యాంక్‌లో తల్లిపాలు దానం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో భాగంగా జీజీహెచ్ ఆవరణలో నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత సహా గైనిక్, పీడియాట్రిక్ వైద్య బృందాలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షాల ప్రారంభం


తూరంగి పంచాయతీలో చెత్త రిక్షాలను ప్రారంభిస్తున్న కురసాల సత్యనారాయణ

కాకినాడ సిటీ: తూరంగి గ్రామ పంచాయతీలో కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో 10 చెత్త సేకరణ రిక్షాలను కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తిస్తూ వైఎస్సార్ సీపీ నాయకుడు అనిశెట్టి రామకృష్ణ 63 మందికి రెయిన్ కోట్లును పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు దాట్ల సత్యనారాయణరాజు, దుగ్గన దొరబాబు, పంపన రామకృష్ణ, కడలి సాయి, రొంగల వెంకటేశ్వరరావు, గొల్లపల్లి బాబులు, నరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


వాకలపూడి సచివాలయం - 3లో పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

కాకినాడ రూరల్: వాకలపూడి సచివాలయం–3లో శుక్రవారం ఉదయం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కిట్లను బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేసి వారిని ఆరోగ్య అవగాహన సూత్రాలు తెలియజేశారు. కర్రి చక్రధర్, నల్ల రాణి, కడియాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

వేళంగిలో తల్లిపాల వారోత్సవాలు

కరప: మండలంలోని వేళంగిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ సవిలే నీలిమ పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు టేక్ హోమ్ రేషన్ అమలుచేస్తున్నారని తెలిపి, ప్రభుత్వమిచ్చిన రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సవిలే రాజేష్, పాలిక సూరిబాబు పాల్గొన్నారు.


వేళంగిలో కిట్లను అందజేస్తున్న సర్పంచ్ నీలిమ తదితరులు

జేఎన్‌టీయూకే సెక్యూరిటీ గార్డుపై దాడి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఆవరణలో స్పోర్ట్స్ బైక్‌పై వేగంగా వస్తున్న ఓ విద్యార్థిని అడ్డుకున్న సెక్యూరిటీ గార్డుపై విద్యార్థితో పాటు, అతని సోదరుడు దాడిచేసి గాయపరిచారు. పుడ్‌టెక్నాలజీలో కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థి దాడిలో గాయపడిన గార్డును గార్డుల సూపర్‌వైజర్ మౌళి ప్రిన్సిపాల్ చాంబర్‌కు తీసుకువెళ్లి వివాదం సద్దుమణిగించారు. అనంతరం సాయంత్రం విద్యార్థితో పాటు అతని బంధువులు వర్సిటీకి వచ్చి మళ్లీ సెక్యూరిటీ గార్డును కొట్టడంతో ముక్కు నుంచి తీవ్రంగా రక్తస్రావమై ఎముక విరగడంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో జీజీహెచ్ పోలీసులు ఎంఎల్‌సీ నమోదు చేసి సర్పవరం స్టేషన్‌కు పంపించారు.

బేబి చిత్ర బృందం సందడి

కాకినాడ కల్చరల్: బేబి చిత్ర బృందం కాకినాడలో సందడి చేసింది. బేబి చిత్రం విజయోత్సవంలో భాగంగా శుక్రవారం చిత్ర బృదం పద్మప్రియ కాంప్లెక్స్‌ను శుక్రవారం సందర్శించింది. ఉదయం ఆట సమయంలో తెరవద్ద ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రేక్షకులకు చిత్ర బృదం అభివాదం చేశారు. చిత్రానికి విజయాన్ని అందించిన ప్రేక్షులకు హీరోలు ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకొనే విధంగా ముఖ్యంగా యువతకు మంచి సందేశం ఇస్తూ చిత్ర నిర్మాణం చేశామని దర్శకులు సాయి రాజేష్ అన్నారు. తాను హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం విజయవంతం కావడం ఆనందంగా ఉందని కథానాయకి వైష్ణవి చైతన్య అన్నారు. థియేటర్ మేనేజర్ చిన్ని, వెంకటేష్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


బేబి చిత్ర బృందానికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

పాలనా సంస్కరణలపై శిక్షణ


ఇండోర్ సదస్సులో వివిధ రాష్ట్రాల కమిషనర్లతో పాల్గొన్న డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

- ఇండోర్ సదస్సుకు హాజరైన కమిషనర్ మహేష్‌కుమార్
- మెరుగైన పాలనపై చర్చ

కాకినాడ: దేశంలోని వివిధ నగరపాలక సంస్థల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవలసిన పాలనా సంస్కరణలు, అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఇండోర్‌లో అర్బన్ శానిటేషన్ అండ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో గత నెల 31 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఈ శిక్షణ జరిగింది. స్థానిక కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ హిమాన్సురాయ్, స్వచ్ఛ భారత్ మిషన్ జాయింట్ సెక్రటరీ రూపామిశ్రాతో పాటు అనేకమంది ప్రతినిధులు శిక్షణలో పాల్గొన్నారు. అత్యుత్తమ పాలనా సంస్కరణల ద్వారా దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సాధించిన ఇండోర్ వంటి నగరాల్లో అమలు జరుగుతున్న పరిపాలనా విధానాన్ని సదస్సులో వివరించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్న ఈటీసీ మేనేజర్ శ్రీనివాసరావు

సామర్లకోట: ఉపాధి పనులు మరింత నాణ్యతతో జరిగేలా డ్వామా అధికారులు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం మేనేజర్, సీనియర్ ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు తెలిపారు. కేంద్రంలో 11 జిల్లాలకు చెందిన డ్వామా ఏపీడీ, ఏపీఓలకు రెండో బ్యాచ్‌లో మూడు రోజుల శిక్షణలో శుక్రవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, కేఆర్ నిహారిక, వి.ప్రసాద్ రెండో రోజు శిక్షణ ఇచ్చారు.

నిర్లక్ష్యపు చీకట్లు తొలగాయి


కాకినాడ 1వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో నాలుగు రోజులు క్రితం పార్కు దుస్థితి ఇలా...


సాక్షిలో కథనంతో ఆర్టీసీ కాలనీలో పచ్చిక తొలగిస్తున్న సిబ్బంది

- ఆర్టీసీ కాలనీ పార్కులో విద్యుత్ వెలుగులు
- పేరుకున్న పచ్చిక తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ రూరల్: చిన్నారులకు ఆట విడుపు.. పెద్దలకు వాకింగ్‌తో పాటు ఓపెన్ జిమ్. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, సెలవురోజుల్లో సందడిగా కనిపించే ఆర్టీసీ కాలనీలోని ఆర్టీసీ కాలనీ పార్కుపై నిర్లక్ష్యపు చీకట్లు తొలిగాయి. నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటో డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ వాసులకు అందుబాటులో ఉన్న ఈ పార్కులో ఏడాదిగా వెలగని విద్యుద్దీపాలు ఇప్పుడు వెలుగుతున్నాయి. నాలుగు రోజుల్లో పార్కు రూపురేఖలు మారిపోయాయి. నిర్లక్ష్యపు చీకట్లు పేరిట ఈ నెల ఒకటో తేదీన సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కథనం వచ్చిన రోజు నుంచే పచ్చిక తొలగింపు ప్రారంభించి విద్యుత్ దీపాలు బాగుచేసి వెలిగించారు. దీంతో కార్పొరేషన్ అధికారులకు స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్పొరేషన్ డీఈ వెంకట్రావు మాట్లాడుతూ పార్కులో పచ్చి తొలగించి శుభ్రం చేయించామని, విద్యుద్దీపాలు మరమ్మతులు చేయడంతో వెలుగుతున్నాయన్నారు. జిమ్ సామగ్రి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


ఆర్టీసీ కాలనీలో విద్యుద్దీపాలు వెలిగిస్తున్న సిబ్బంది

ఆక్వాకల్చర్‌లో ఉపాధి అవకాశాలు మెండు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జంతుశాస్త్ర, అక్వాకల్చర్ విభాగాల ఆధ్వర్యంలో గ్రీన్ ఇనిషియేటివ్ ఫర్ సస్టైనబుల్ ఆక్వా కల్చర్ అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నన్నయ వర్సిటీ వీసీ డాక్టర్ కె.పద్మరాజు హాజరై అక్వాకల్చర్‌లో ఉపాధి అవకాశాలపై వివరించారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఇటీవల కాలంలో పెరుగుతున్న అక్వారంగం ప్రగతిని, దానిలోని ఉపాధి అవకాశాలను వివరించారు. సీనియర్ సైంటిస్ట్, సీఐఎఫ్ఈ ఇన్‌చార్జి పి.మురళీధర్ అక్వాకల్చర్ చేయడానికి యాజమాన్య పద్ధతులు, మెళకువలు వివరించారు. సన్‌రైజ్ అక్వా అధినేత రామ్మోహనరావు ఆధునిక పద్ధతులలో అక్వాకల్చర్ ఆవశ్యకత వివరించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు కర్రి భామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న నన్నయ వీసీ పద్మరాజు, చిత్రంలో ప్రిన్సిపాల్ తిరుపాణ్యం

నేటి నుంచి హెల్ప్‌డెస్క్

సామర్లకోట: మున్సిపాలిటీలో శనివారం నుంచి మూడు రోజుల పాటు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందన్నారు. కాలనీ వాసులు వారి సమస్యలు, సలహాలకు పి.జానకిబాబు 98660 16053, బి.అప్పారావు 93470 60295 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.